క్లుప్తంగా

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

చీరాల టౌన్: భక్తుల కొంగు బంగారం కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామాన్ని సుభిక్షంగా ఉంచడంతో పాటుగా కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు సౌకర్యాలను కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేశారు.

పుస్తక పఠనంతో మరింత విజ్ఞానం



విద్యార్థులచే పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ బాదం వియభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శాఖా గ్రంధాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే కథల పుస్తకాలు, దేశనాయకులు చరిత్రలు చదివించారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఏచూరి స్థానం సుస్థిరమైనది



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అద్దంకి రూరల్: దేశ, అంతర్జాతీయ రాజకీయాల్లో సీతారాం ఏచూరి స్థానం సుస్థిరమైనదని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం మండల అధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు ఆధ్వక్షతన సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి సీతారాం సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ నేతగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం భారత కమ్యూనిస్టు పార్టీ అత్యున్నత బాధ్యత అయిన జాతీయ కార్యదర్శిగా ఉద్యమ ప్రయాణం సాగించారన్నారు. ఎంతో క్లిష్టమైన సమస్యలను పరిష్కరించటంలో ఆయనది ప్రత్యేకమైన శైలి అన్నారు. అనంతరం ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

31న చలో విజయవాడ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మార్టూరు: కార్మిక, ఆదివాసి, పౌరహక్కుల కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంతాప సభ ఈనెల 31న విజయవాడలో జరగనుందని అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆదివారం మార్టూరులో ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు కరపత్రాన్ని ఆవిష్కరించి పంపిణీ చేశారు. రాజ్యహింస కేసులో అన్యాయంగా జైలు పాలై చివరకు సుప్రీం కోర్టులో నిర్దోషిగా నిర్ధారించబడి అనంతరం అనారోగ్యంతో అసువులు బాసిన సాయిబాబా జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని వారు కొనియాడారు. మాజీ పార్లమెంటు సభ్యుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు, పౌరహక్కుల నేతలు, జర్నలిస్టులు, మేధావులు, విరసం నాయకులు పాల్గొననున్న సాయిబాబా సంతాప సభను ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న సభకు హాజరుకావాలని వారు కోరారు.

ఊపందుకున్న వరి

- ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు
- కొమ్మమూరు, సాగర్ కాల్వలో ఆలస్యంగా నీరు
- పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు
- వేధిస్తున్న కూలీల కొరత
- నీటి విడుదలలో కూటమి ప్రభుత్వం విఫలం



కారంచేడు-చీరాల రోడ్డులో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

కారంచేడు: తుఫాన్ కారణంగా వరినాట్లు ఊపందుకున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కొమ్మమూరు కాలువ ఆయకట్టుతో పాటు, నాగార్జునసాగర్ ఆయకట్టు చివరి భూముల్లోను వరిసాగు ముమ్మరంగా సాగుతోంది. ఆగస్టు నెలాఖరు నుంచి నాట్లు వేసుకోవడం ఇక్కడి రైతులకు ఆనవాయితీగా వస్తుంది. అయితే ఆ సమయంలో కాలువకు సాగునీరు అందకపోడవంతో నార్లు పోసుకోవడం ఆలస్యం అయ్యింది. సెప్టెంబర్‌లో వచ్చిన తుఫాను కారణంగా కాలవలు ఉప్పొంగడంతో పాటు, పొలాల్లో నీరు నిలిచిపోవడంతో మరికొంత ఆలస్యంమైంది. దీంతో ఆలస్యంగా ప్రారంభమైన వరినాట్లు ఎట్టకేలకు అక్టోబర్‌లో ముమ్మరంగా సాగుతున్నాయి. కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని కారంచేడు, పర్చూరు, చీరాల, వేటపాలెం, చినగంజాం, నాగులుప్పలపాడు మండలాల్లోని సుమారు లక్ష ఎకరాల సాగు విస్తీర్ణంలో వరిసాగు అవుతుంది. మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల పరిధిలో ఖరీఫ్ సాగులో సుమారు 15 వేలకు పైగా ఎకరాల్లో వరిసాగుకు అన్నదాతలు తమ పనులు ప్రారంభించారు. కొన్ని ప్రాంతాలలోని రైతులు నార్లు పోసుకుంటుంటే మరి కొంత మంది నాట్లు వేస్తున్నారు. కొంత మంది నాట్ల కోసం చేలల్లో దమ్ములు చేసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు పనులు లేక చెట్ల కింద కాలక్షేపం చేసిన అన్నదాతలు పలుగు, పారలు పట్టి చేలకు పయనమవుతున్నారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాతలు..

కొంత ఆలస్యంగా ప్రారంభమైన వరిసాగుతో అన్నదాతలు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని దగ్గుబాడు, పోతినవారిపాలెం, నాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం, తిమిడెదపాడు ప్రాంతాల్లో ఎక్కువగా సాగర్ ఆయకట్టు కింద మాగాణి పంటలతో పాటు మెట్ట పంటలు కూడా ఎక్కువగా సాగు చేస్తుంటారు. పైగ్రామాల పరిధిలో మిరప, పొగాకు పంటలను సాగు చేసిన అన్నదాతలు వాటికి చీడ, పీడలు ఆశించకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ అనునిత్యం తాము సాగు చేసిన పంటలను బిడ్డలను కాపాడుకుంటున్న రీతిలో కాపాడుకుంటున్నారు. ఆదిపూడి, యర్రంవారిపాలెం, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, పర్చూరు, వీరన్నపాలెం ప్రాంతాల్లోని రైతన్నలు శనగ సాగుకు అవసరమైన పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కొంత మంది రైతులు వరి సాగులోను, మరికొంత మిరప, మినుము, పొగాకు సాగులోను, మిగిలిన రైతులు శనగ సాగుకు అవసరమైన పనులను చేసుకోవడంలోను నిమగ్నమయ్యారు. దీంతో వ్యవసాయ కూలీలకు కూడా మంచి గిరాకీ ఏర్పడినట్లయ్యింది. కాని కూలీలు దొరకడం లేదని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కారంచేడు ప్రాంతంలో పచ్చని నారుమళ్లతో కళకళలాడుతున్న వరి చేలు

వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి..

కొమ్మమూరు కాలువ కింద వరిసాగు ముమ్మరంగా సాగుతోంది. కొంత ఆలస్యంగా ప్రారంభమైనా ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉండటంలో వరినాట్లు ముమ్మరంగానే జరగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో ముందుగా ప్రారంభించారు, దిగువున ఉన్న చేలల్లో మాత్రం కొంత ఆలస్యంగానే పనులు జరుగుతున్నాయి.

– వై. వెంకటేశ్వర్లు, రైతు, స్వర్ణ

వ్యవసాయ కూలీలకు గిరాకీ ఉంది..

వ్యవసాయ పనులు ప్రస్తుతంగా బాగా జరుగుతున్నాయి. వరినాట్లతో పాటు, మెట్ట పొలాల్లో కలుపులకు కూడా వ్యవసాయ కూలీలు అవసరం ఉండటంతో మంచి గిట్టుబాటుగానే ఉంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే రోజుల్లోనే వ్యవసాయ కూలీలకు నాలుగు రూపాయలు మిగిలుతాయి. పనులు ఇంకా నెలకు పైగానే సాగుతాయి.

– సీహెచ్ సుబ్బాయమ్మ, వ్యవసాయ కూలీ, కారంచేడు



కారంచేడు పొలాల్లో నాట్లు వేయడానికి నారు తరలిస్తున్న ఆటో..

ఏకేయూ కబడ్డీ జట్టుకు మణిరెడ్డి



మణిరెడ్డి

చినగంజాం: చినగంజాంకు చెందిన బాల కోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారుడు సోపర్ల మణిరెడ్డి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం విశ్వవిద్యాలయంలో కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించారు. పోటీల్లో మణిరెడ్డి ప్రతిభ కనబరచి విశ్వవిద్యాలయం జట్టులో స్థానం సాధించాడు. ప్రస్తుతం మణిరెడ్డి సింగరాయకొండ పీఎంపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం బీఏ చదువుతున్నాడు. ఈ నెల 30 నుంచి నవంబర్ 3 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ టోర్నమెంట్‌లో క్రీడాకారుడు పాల్గొనున్నాడు. క్లబ్ అధ్యక్షుడు, కోచ్ ఎం గిరిబాబు, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, క్లబ్ కార్యదర్శి బోగిరెడ్డి నాగాంజనేయులు, క్లబ్ సీనియర్ క్రీడాకారులు కంసాని సతీష్, బోగిరెడ్డి శివారెడ్డి, దేశం సుబ్బారెడ్డిలు మణిరెడ్డికి అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ ఒరిగి కూలీలకు గాయాలు

చీరాల అర్బన్: వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై వెళ్తున్న వ్యవసాయ కూలీలు ట్రాక్టర్ పక్కకు ఒరగడంతో కూలీలకు గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం మండలంలోని బోయినవారిపాలెంలో చోటుచేసుకుంది. కర్లపాలెం నుంచి బోయినవారిపాలేనికి వ్యవసాయ పనులు నిమిత్తం ట్రాక్టర్‌పై వస్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం



వర్షానికి గుంతలమయమైన మార్గం



చప్టావద్ద తీవ్రంగా కోతకు గురైన రోడ్డు

- భారీ వర్షంతో కోతకు గురైన పల్లెపాలెం రోడ్డు
- వాహనదారులకు కష్టాలు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

చినగంజాం: తుఫాన్, అల్పపీడన ప్రభావంతో నిరివ్రామంగా కురిసిన భారీ వర్షానికి మండలంలోని పల్లెపాలెం రోడ్డు దెబ్బతినిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుసిన వర్షంతో సాఫీగా ఉన్న తారు రోడ్డు కోతకు గురైంది. మండల కేంద్రం చినగంజాం నుంచి పల్లెపాలెం పంచాయతీలో బాపయ్యనగర్ సముద్రతీరం వరకు ఉండే రోడ్డు మార్గం వర్షాల కారణంగా దెబ్బతింది. రోడ్డు మార్గం అంతా గుంతలమయమై పూర్తిగా కోతకు గురైంది. రోడ్డుకు ఇరువైపులా పూర్తిగా ఛిద్రమై వాహనదారులకు ఇబ్బందిగా మారింది. చినగంజాం నుంచి పల్లెపాలెం పంచాయతీకి వెళ్లే ఈ మార్గంలో పల్లెపాలెం గ్రామానికి చెందిన నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు, సముద్ర తీరానికి తరచుగా వెళ్లే సందర్శకులు, నిత్యం ఉప్పు కొఠారు భూములకు వెళ్లే కూలీలు,ద్విచక్ర వాహనదారులు, కార్లు, లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి పరిస్థితిలో రోడ్డు అస్తవ్యస్తంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తింది.

మరమ్మతులు చేపట్టాలని ప్రజల వినతి..

నిత్యం ప్రజలు, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పల్లెపాలెం రోడ్డును త్వరితగతిన మరమ్మతులు చేపట్టి బాగు చేయాలని, లేకుంటే అవస్థలు పడాల్సి వస్తుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో రోడ్డు సక్రమంగా లేకుంటే ప్రమాదాలు చోటు చేసుకునేందుకు అవకాశం ఉందని వారంటున్నారు. ముఖ్యంగా లారీలపై భాగంలో బస్తాలపై కూర్చొని ప్రయాణం సాగించే కూలీలు రోడ్డ గుంతలమయమైతే వారికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యపై దృష్టి పెట్టి సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





వర్షానికి కోతకు గురైన తారు రోడ్డు

ఆధ్యాత్మిక, సమాజ సేవలకే ప్రాధాన్యం



రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక సేవలకే ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరానికి హాజరైన 1193 మందికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి నెల ఉచిత షుగరు వైద్య శిబిరాన్ని నిర్వహించి పేదలకు ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నామని, ట్రస్ట్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కృష్ణారావు, శంకరరావు, సురేష్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువత బలవన్మరణాల నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న ఫౌండేషన్ స్థాపకుడు శామ్యూల్ రెడ్డి

మేదరమెట్ల: యువత ప్రేమ విఫలమై బలవన్మరణాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటిని నిర్మూలించేందుకే స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఈదా శామ్యూల్‌రెడ్డి అన్నారు. మేదరమెట్లలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన కుమార్తె స్పందన్ ఈద ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇలాంటి పరిస్థితి ఏ కుటుంబంలో జరగకూడదనే ఉద్దేశంలో 2020లో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. క్షణికావేశాలకులోను కాకుండా అలాంటి వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించడం, వారిని ధృఢంగా మార్చడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు 1200 మందికి అవగాహన కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో శింగమనేని శ్రీనివాసరావు, కోయి అంకారావు, జజ్జర ఆనందరావు, సైకాలజీ లెక్చరర్ చంద్రిక, జీఎంఆర్ ఎండీ మురళి, శ్రీనివాసరావు, మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా గిడియన్స్ పరిచర్య




సందేశం అందిస్తున్న బ్రదర్ ప్రకాశరావు

చీరాల రూరల్: ప్రపంచ వ్యాప్తంగా 200లకు పైగా దేశాలలో గిడియన్స్ ఇంటర్నేషనల్ బైబిల్ పరిచర్య కొనసాగుతుందని గిడియన్స్ ఇంటర్నేషనల్ చీరాల యూనిట్ ప్రతినిధి బ్రదర్ యాజల ప్రకాశరావు అన్నారు. గిడియన్స్ సండేను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని అన్ని చర్చిలలో గిడియన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గిడియన్స్ యూనిట్ ప్రతినిధులు ఆయా చర్చిలలో దేవుని వాక్య సందేశాలు అందించారు. స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో బ్రదర్ యాజల ప్రకాశరావు, బ్రదర్ యండ్రపాటి జాన్సన్, జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ చర్చిలో డాక్టర్ ఇస్తర్ల బాబు రావు, కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీలోని లూథరన్ చర్చిలో బ్రదర్ దేవదాసులు దేవుని వాక్య సందేశాలు అందించారు. క్రీస్తు సువార్త అందని ప్రదేశాలలో సువార్తను అందించడమే గిడియన్స్ ఇంటర్నేషనల్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

380 మందికి అన్న వితరణ

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డులో గల అయ్యప్ప స్వామి దేవస్థానంలో గణపతి మురుగన్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో 8వ రోజు ఆదివారం 380 మంది స్వాములు అన్నదాన వితరణ చేశారు. పోకూరి హనుమంతరావు, రమాదేవి కుటుంబ సభ్యులు అన్నదాతలుగా పాల్గొన్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు.

గంగమ్మతల్లికి పొంగళ్లు, నైవేద్యాలు



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లికి ఆదివారం ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు. ఈఏడాది వర్షాలు బాగా పడాలని, పంట కాలువలు సాగు నీటితో కళకళలాడాలని, మంచి దిగుబడులతో పాటు, గిట్టుబాటు ధరలను అమ్మవారు కల్పిస్తారని అన్నదాతలు, గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

మార్టూరు: మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ నార్త్ రోటరీ క్లబ్ వారు ఐదుగురు బాలికలను గుర్తించి వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎం కోటేశ్వరరావు, ఎం సాంబశివ రావు, మోహనరావు, ఆంజనేయులు, పాల్గొన్నారు.

చెకుముకిలో కొప్పరపాడు విద్యార్థుల ప్రతిభ



ప్రశంస పత్రాలు, మెడల్స్ అందుకున్న విద్యార్థులు

బల్లికురవ: జిల్లా స్థాయిలో చీరాల దేశాయిపేటలో ఆదివారం జరిగిన చెకుముకి ప్రతిభా పరీక్షలో మండలంలోని కొప్పరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. త్వరలో రాష్ట్రస్థాయిలో విశాఖపట్నంలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పీ. శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల మండల స్థాయిలో బల్లికురవలో జరిగిన చెకుముకి పరీక్షలో కొప్పరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన కె. నాగసాయి, చరణ్ తేజ, కె. కోటేశ్వరరావు, ఎస్‌కె మస్తాన్ ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో 25 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా కొప్పరపాడు విద్యార్థులు తిరిగి ప్రతిభ చూపటంతో ప్రశంస పత్రాలు, మెడల్స్ కైవసం చేసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎంతోపాటు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పీయంసీ అభినందనలతో ముంచెత్తారు.

తీరంలో పర్యాటకుల సందడి



వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. చీరాల, పర్చూరు, అద్దంకి, ప్రత్తిపాడు, గుంటూరు, చిలకలూరిపేట, నరసరావుపేట ప్రాంతాలకు చెందిన వారితో పాటుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాహనాల్లో తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి సందడి చేశారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో గడిపారు. తీరం ఒడ్డున యువకులు, మహిళలు చిన్నారులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు.

రోటరీ యువజన వారోత్సవాలు ప్రారంభం



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటి హాలులో రోటరీ యువజన వారోత్సవాలను ప్రారంభించారు. వారం రోజులు పాటు విద్యార్థులకు పలు పోటీలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చందలూరి వెంకటేశ్వరరావు, యువజన వారోత్సవాల చైర్మన్ వలివేటి మురళీకృష్ణలు తెలిపారు. ఆదివారం యువజన వారోత్సవాల్లో భాగంగా బాలబాలికలకు చెస్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో 70 మంది బాలబాలికలు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా చెస్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఎ.వి జయకుమార్ నిర్వహణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యుడు పోలుదాసు రామకృష్ణ, గుర్రం రాఘవరావు, తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, డాక్టర్ ఇస్తర్ల బాబూరావు, పి.శివాంజనేయ ప్రసాద్, జీవై ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.